


తూర్పు కనుమల్లో కొత్త కప్ప జాతి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)



జంతు శాస్త్రవేత్తలు తూర్పు కనుమ ప్రాంతాల్లో జరుపుతున్న పరిశోధనలలో గోధుమ వర్ణ చెవి పొదకప్ప కొత్త జాతిని కనుగొన్నారు. దశాబ్దాల క్రితం శ్రీలంకలో మనుగడ సాగించే " స్యూడో ఫిలీటస్ " అనే జాతికి చెందిన కప్ప ఇప్పుడు భారతదేశంలోని తూర్పు కనుమల్లో కనిపించడం అంటే పూర్వం భారతదేశం, శ్రీలంక దేశాలు కలిసివున్నాయి అనడానికి నిదర్శనం అని జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ ధ్రితి బెనర్జీ తెలిపారు.

ప్లీజ్... మీ పార్టీలో చేర్చుకోండి..!



'ప్లీజ్..ప్లీజ్.. మీ పార్టీలో చేరిపోతాం.. కండువా కప్పి మమ్మల్ని ఆహ్వానించండి' అంటూ వైసిపి కార్పొరేటర్లు కూటమి నేతలను వేడుకొంటున్నారు. నెలరోజులుగా ఈ తంతు సాగుతోంది.. దాదాపు 30 మంది కార్పొరేటర్లు 'కూటమి' కండువా కప్పుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. అయితే కూటమి ఆశావాహులు మాత్రం 'ససేమిరా' అంటున్నారు. టిడిపి హైకమాండ్ ఆదేశాలకై ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు నిరీక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం ఎస్వీ సెనెట్ హాల్లో బుధవారం మధ్యాహ్నం జరగనుంది. ఈ నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యత సంతరించుకుంది.

- 30 మంది వైసిపి కార్పొరేటర్లు సిద్ధం
- వద్దంటున్న 'కూటమి' ఆశావాహులు
- టిడిపి హై కమాండ్ ఆదేశాలకై నిరీక్షణ
- 'మేయర్' కోసం 'కూటమి'లోనే లొల్లి
- నేడు తిరుపతి కార్పొరేషన్ కౌన్సిల్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో తిరుపతి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసవత్తరంగా సాగనుంది. 50 డివిజన్లకు గాను వైసిపి 48 గెలుచుకుంది. ఒక్క డివిజన్ టిడిపి కార్పొరేటర్ ఆర్‌సి మునికృష్ణ గెలుపొందారు. ఏడో డివిజన్ కోర్టు కేసులో ఉంది. వైసిపికి చెందిన ఇద్దరు డిప్యూటీ మేయర్లలో భూమన అభినయ్‌రెడ్డి నాలుగో డివిజన్‌కు రాజీనామా చేసి అసెంబ్లీకి పోటీ చేశారు. ముద్ర నారాయణ డిప్యూటీ మేయర్‌గా కొనసాగుతున్నారు. ఆయన కూడా పార్టీ మారే జాబితాలోనే ఉన్నారని చర్చ నడుస్తోంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందే టిడిపి, జనసేన పార్టీల్లో ఐదుగురు కార్పొరేటర్లు చేరిపోయారు. ఈ నేపథ్యంలో కూటమి సంఖ్య ఆరుకు చేరుకుంది. మేయర్ డాక్టర్ శిరీషను తమ పార్టీలో చేరాలని కూటమి నేతలు సుగుణమ్మ, నరసింహయాదవ్ ప్రయత్నించినా ఆమె ససేమిరా అన్నట్లు సమాచారం. తిరుపతి ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు జనసేన నుంచి పోటీ చేయడంతో ఎక్కువమంది వైసిపి కార్పొరేటర్లు జనసేనలోకి చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. సోమవారం తిరుపతిలో జరిగిన కూటమి నేతల సమావేశంలో వైసిపి కార్పొరేటర్లను ఇపుడే ఆహ్వానించవద్దని ఆశావాహులు పేర్కొన్నట్లు తెలుస్తోంది. గతంలో కూటమి నేతలను ఇబ్బంది పెట్టిన వారిని కూటమిలో చేర్చుకుంటే పార్టీకే చెడ్డపేరన్నది వారి వాదన. అయితే ఇప్పటికే చిత్తూరు మున్సిపల్ మేయర్, డిప్యూటీ మేయర్లు టిడిపి తీర్థం పుచ్చుకున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో తిరుపతి కార్పొరేషన్ రాజకీయ జంపింగ్స్ ఎలా ఉంటాయో వేచి చూడాల్సిందే.

'మేయర్' పదవిపై 'అన్నా' కుటుంబం ఆశలు

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా గతంలో ప్రయత్నించి విఫలమైన అన్నా రామచంద్రయ్య కుటుంబ సభ్యులు తిరుపతి మేయర్ పదవిపై మరోసారి ఆశపెట్టుకున్నారు. ఈ నేపథ్యంలోనే 20 మంది వైసిపి కార్పొరేటర్లను కూటమిలో చేర్చేందుకు రాయబారాలు నడిపారు. అయితే అన్నా రామచంద్రయ్య కుటుంబ సభ్యులకు మేయర్ పదవి ఇస్తే, గతంలో వైసిపి ఆగడాలు ఎలా ఉన్నాయో, అన్నా కుటుంబం అలాగే ఉంటుందని 'కూటమి'లోనే కొందరు వ్యతిరేకిస్తున్నారు. ఏదిఏమైనా మేయర్ సీటు కోసం టిడిపి, జనసేనలోనే పోటీ ఉన్నప్పటికీ వారు బయట పడటం లేదు. తిరుపతి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుగుణమ్మ తన మనవరాలిని నాలుగో డివిజన్ కార్పొరేటర్‌గా ఏకగ్రీవం చేసుకుని డిప్యూటీ మేయర్, లేదా మేయర్ పదవి కావాలని ఆశపడుతున్నారు.

43 అంశాలతో అజెండా సిద్ధం

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం మూడు నెలల తర్వాత జరుగుతోంది. బుధవారం జరగనున్న కౌన్సిల్ సమావేశంలో 43 అంశాలను అజెండాలో పొందుపరిచారు. ఇందులో కమిషనర్ బంగ్లా నిర్మాణం ఖర్చులు, పారిశుధ్య పరికరాల కొనుగోలు, కాంట్రాక్ట్ కార్మికుల జీతభత్యాలు వంటివి అజెండాలో రూపొందించారు. ఈ కౌన్సిల్ సమావేశానికి తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సభ్యులుగా హాజరు కానున్నారు.

ఏడాదిన్నరలో కార్పొరేషన్ ఎన్నికలు

ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు

కార్పొరేషన్ ఎన్నికలకు సమాయత్తం కావాలని ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు అన్నారు. ఎన్నికల్లో కూటమి తరపున కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని అన్నారు. ఏడాదిన్నరలో జరిగే ఎన్నికలకు కూటమి నేతలు సిద్ధం కావాలన్నారు. జనసేన, టిడిపి, బిజెపి మైత్రి పదేళ్లు ఉండాలన్నది పవన్‌కల్యాణ్, చంద్రబాబు ఆకాంక్ష అన్నారు. చిన్న చిన్న ఒడిదుడుకులను సమన్వయంతో పరిష్కరించుకోవాలన్నారు. మంగళవారం సాయంత్రం చెన్నారెడ్డి కాలనీలో టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి పుష్పవతి ఆధ్వర్యంలో కృతజ్ఞతా సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో సుగుణమ్మ, పులిగోరు మురళీకృష్ణారెడ్డి, మునిశేఖర్ రాయల్, నరసింహయాదవ్, కోడూరు బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.



క్లస్టర్ అభినందన సమావేశంలో ఎంఎల్ఎ ఆరణి

మానసిక వికలాంగ కేంద్రంలో..

డయేరియాతో ఇద్దరు మృతి

- మరో 14మందికి చికిత్స
- 'పాస్', రుయాలో కలెక్టర్ తనిఖీ

ప్రజాశక్తి - తిరుపతి సిటి


నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

తిరుపతి రూరల్ పద్మావతిపురంలోని 'పాస్' మానసిక వికలాంగుల కేంద్రంలో మంగళవారం విషాదం చోటు చేసుకుంది. ఆశ్రయం పొందుతున్న మానసిక వికలాంగుల్లో ఇద్దరు అనాథలు గణపతి (35), శేషాచలం (16) అతిసారతో మృతిచెందారు. మరో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. దాదాపు 9 మంది రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ వెంకటేశ్వర్లు పాస్ మానసిక వికలాంగ కేంద్రాన్ని, రుయాలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. వీరిలో ఇద్దరిని మెరుగైన చికిత్స నిమిత్తం కలెక్టర్ స్విమ్స్‌కు రిఫర్ చేశారు. ఘటనకు కారణాలను వైద్యాధికారులను, నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. నీటిని, ఆహారాన్ని పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు తరలించారు.

డయేరియా బాధితులను పరామర్శించిన కలెక్టర్

రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులను పరామర్శించి, వారికి మెరుగైన వైద్యం అందించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ వైద్య అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న (పాస్ మనో వికాస్) మానసిక దివ్యాంగుల ప్రత్యేక ఆశ్రమ పాఠశాల డయేరియా బాదితులు ఉండే వార్డులను సందర్శించి వైద్య సిబ్బందికి సూచిస్తూ బాధితులకు మెరుగైన వైద్యం అందించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 16 మంది డయేరియా బాధితులలో ఇద్దరు మరణించారని, మిగిలిన వారి ఆరోగ్యం నిలకడగా ఉందని, వారికి స్పెషలిస్ట్ డాక్టర్ల ద్వారా చికిత్స అందిస్తున్నామని తెలిపారు. అందులో ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం స్థానిక స్విమ్స్ ఆసుపత్రికి తరలించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. మానసిక దివ్యాంగుల ప్రత్యేక ఆశ్రమ పాఠశాల ఎన్‌జిఓ ఆధ్వర్యంలో నడుస్తోందన్నారు. ఈ ఆశ్రమంలో సుమారు 6 సంవత్సరాల నుండి 45 సంవత్సరాల లోపు వయసు గల 72 మంది ఆశ్రయం పొందుతున్నారు. జూలై 6వ తేదీన మధ్యాహ్నం అల్పాహారం తీసుకున్న తర్వాత ఆదివారం ఉదయం నుండి కొంతమందికి వాంతులు, విరోచనాలు అయిన వారికి మెట్రోజెల్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు వారికి అందించడం జరిగిందని, అయినప్పటికీ వారికి డయేరియా కంట్రోల్ కాకపోవడం వలన వారికి మెరుగైన చికిత్స కోసం సోమవారం ఉదయం వారిని సదరు ఎన్జీఓ రుయా ఆసుపత్రికి తీసుకొచ్చారన్నారు. జిల్లా యంత్రాంగం పూర్తిగా డయేరియా నియంత్రణకు చర్యలు చేపడుతోందన్నారు. ఆశ్రమంలో ఉన్న మిగిలిన పిల్లలు డయేరియా బారిన పడకుండా వారికి ప్రత్యేక మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశామని తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారు త్వరగా కోలుకునే విధంగా అన్నిరకాల చర్యలు జిల్లా యంత్రాంగం చేపడుతోందని తెలిపారు. అనంతరం స్థానిక పద్మావతి పురంలోని (పాస్ మనో వికాస్) మానసిక దివ్యాంగుల ప్రత్యేక ఆశ్రమ పాఠశాలను జిల్లా కలెక్టర్ తనిఖీ చేసారు. మానసిక దివ్యాంగుల ఆదర్శ ప్రత్యేక పాఠశాలలో డయేరియా ప్రబలడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమంలో తాగునీరు, వంటగదిని, పరిసరాలను పరిశీలించారు. ఆశ్రమంలో ఎప్పటికప్పుడు బ్లీచింగ్ తో శుభ్రపరిచి స్వచ్ఛమైన నీరు, పరిశుభ్రమైన ఆహారం వారికి అందించాలని ఆశ్రమ సిబ్బందికి తెలిపారు. ఆశ్రమంలోని ఇతర పిల్లలకు డయేరియా బారిన పడకుండా వైద్య సిబ్బంది ప్రత్యేక మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి వైద్యులు అందుబాటులో ఉండేలా ఆదేశించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఆర్డిఓ రిశాంత్ రెడ్డి, డిఎంహెచ్ఓ శ్రీహరి, రుయా సూపెరింటెండెంట్ రవి ప్రభు, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రా, వయోవృద్ధుల శాఖ అధికారి శ్రీనివాస్, ఆశ్రమ పాఠశాల జనరల్ సెక్రెటరీ బాలకష్ణమూర్తి, ప్రిన్సిపాల్ మురళీకష్ణ పాల్గొన్నారు.

మోటార్ల భద్రతపై 'అన్నదాతల' కలవరం

ప్రజాశక్తి- డక్కిలి



వెంకటగిరి నియోజకవర్గంలో తెలుగుగంగ కాల్వలకు మోటార్లు ఏర్పాటు చేసుకొని పంటలు సాగు చేసుకొంటున్న రైతులకు నిద్రలేని రాత్రులు తప్పడం లేదు. ఒకప్పుడు విద్యుత్తు ఎప్పుడు సరఫరా అవుతుందా అని ఎదురుచూస్తూ మోటార్ల వద్ద కాపలా కాసేవారు. నేడు అన్నదాతలకు మరో చిక్కు వచ్చి పడింది. తాజాగా చిల్లర దొంగతనాలకు అలవాటు పడిన చోరులు రైతుల వ్యవసాయ మోటార్లను ఎత్తుకెళ్తున్నారు. మోటార్లు లేకపోతే కేబుల్ వైర్లను చోరీ చేస్తున్నారు. తీగల్లో ఉన్న కాపర్ను బయటకు తీసి బహిరంగ మార్కెట్టులో విక్రయించి, సొమ్ము చేసుకొంటున్నారు. మోటార్ నుంచి స్టార్టర్ వరకు ఉండే వైరును ఎక్కువగా కాపర్ ఉన్నదానినే ఏర్పాటు చేస్తారు. తెలుగుగంగ కాలువ వెంబడి ఎక్కువగా ఓపెన్ సబ్ మెర్సీ బుల్ మోటార్లు నీటి లో ఉండేవి కావడంతో స్టార్టరు నుంచి మోటార్ వరకు కాలువ లోతు ఉన్నంత వరకు వైరు ఉంటుంది. దీంతో దొంగలు వాటిని టార్గెట్ చేసి చోరీకి పాల్పడుతున్నారు. గతంలో కాపర్, ఆయిల్ కోసం విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ల దుండగులు ఎత్తుకెళ్లారు. ఈ మధ్య ట్రాన్స్ ఫార్మర్ల చోరీకి కొంత బ్రేక్ పడగా మోటర్ల వద్ద చోరీలు జరుగుతున్నాయి. గతంలో వెంకటగిరి ప్రాంతంలో పెట్లూరు, మొగల్లగుంట డక్కిలి మండలం లోని తెలుగుగంగ కాలువ వెంబడి పంపుసెట్ల వద్ద నుంచి స్టార్టర్ లు, పంట భూముల వద్ద నుంచి ఊటబావుల మోటార్లను ఎత్తుకెళ్లేవారు. ప్రస్తుతం తెలుగుగంగ కాలువ ద్వారా నీటి సరఫరా లేకపోవడంతో మోటార్లు చోరీకి గురయ్యే అవకాశాలు ఉన్నాయని , రైతులు అప్రమత్తంగా ఉండాలని, ప్రస్తుతం మోటార్లు వినియోగించే అవకాశం లేనందున వాటిని తీసి భద్రపరచుకోవాలనీ డక్కిలి ఎస్ఐ చౌడయ్య సూచిస్తున్నారు.

విధిని ఎదిరించైనా విజయం సాధించాలి : డిఇఒ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

విధిని ఎదిరించైనా భవిత విద్యార్థులు విజయం సాధించాలని డిఇఒ వి.శేఖర్ అన్నారు. స్థానిక బైరాగి పట్టెడ లోని మహాత్మా గాంధీ మున్సిపల్ హై స్కూల్ నందు బైరాగి పట్టెడలోని భవిత సెంటర్ విద్యార్థులు గత విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో 28 మంది ఉత్తీర్ణులైన సందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు అభినందన కార్యక్రమం సమగ్ర శిక్ష జిల్లా ఆధ్వర్యంలో ఐ ఈ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి డిఇఒ వి.శేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉప విద్యాశాఖ అధికారి కె.బాలాజీ, మండల విద్యాశాఖ అధికారి బా.భాస్కర్ నాయక్, ఎంజిఎం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎ.మురగన్, సపోర్ట్ ఛారిటబుల్ ట్రస్టు ఫౌండర్ తహసున్నీసా, వేమన విజ్ఞాన కేంద్రం ఫౌండర్ ఎం.నాగార్జున, బాలోత్సవం అధ్యక్షులు నడ్డి నారాయణ హాజరయ్యారు. 28 మంది దివ్యాంగ విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో భవిత సెంటర్ ఉపాధ్యాయుని కే భవాని, ఎంజీఎం పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు ఎంముని శారద, బండి మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అభినందన సభలో డిఇఒ శేఖర్


గిరిజన కాలనీలో నీటి కాలుష్యమే కారణమని తేల్చిన అధికారులు

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

గిరిజన కాలనీకి అధికారుల పరుగులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

తొట్టంబేడు మండలంలోని గుండేలిగుంట పంచాయతీ అల్లూరి సీతారామరాజు గిరిజన కాలనీకి అధికార యంత్రాంగం మంగళవారం పరుగులు పెట్టింది. వేప చెట్టు ఎండిందని ఊరంతా వలస అన్న శీర్షికన అల్లూరి సీతారామరాజు కాలనీలో జరిగిన మూఢనమ్మకాల ఘటనను ప్రస్తావిస్తూ మంగళవారం ప్రజాశక్తి దినపత్రికలో వార్త ప్రచురితమైంది. ఆ మేరకు స్పందించిన శ్రీకాళహస్తి ఆర్డీవో రవిశంకర్ రెడ్డి ఆదేశాల మేరకు అల్లూరి సీతారామరాజు గిరిజన కాలనీకి వెళ్ళి మూఢ నమ్మకాలను నమ్మొద్దని సూచించారు. మూఢ నమ్మకంతో ఊరు విడిచి వెళ్లి పోయిన కొన్ని కుటుంబాలను వెనక్కు పిలిపించారు. మిగిలిన కుటుంబాలను త్వరలో వెనక్కు రప్పించే బాధ్యత స్థానికంగా పని చేసే అధికారులకు అప్పగించారు. తొట్టంబేడు తహశీల్దారు శివరామసుబ్బయ్య, ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్, తొట్టంబేడు పోలీసులు ఇంటింటా సర్వే చేసి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనారోగ్యం బారిన పడిన గిరిజనులు గురించి వారు వివరించారు. అనంతరం అధికారులు ఆ గ్రామంలో గిరిజనులు తాగే నీటిని పరిశీలించారు. తాగునీరు కలుషితం అయినట్లు గుర్తించారు. తాగునీరు కలుషితం, తీవ్రమైన ఎండ కారణంగా గిరిజనులు అనారోగ్యం బారిన పడినట్లు ప్రాథమికంగా గుర్తించారు. తాగునీటి పైపులైను బాగు చేయించని పంచాయతీ కార్యదర్శి ఆనంద్ బాబును అధికారులు మందలించారు. తాగునీటి వ్యవస్థను 24గంటల వ్యవధిలో బాగు చేయాలని ఆనంద్ బాబును ఆదేశించారు

ఉచిత ఇసుక అభినందనీయం

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి, యంత్రాంగం



గత వైసిపి హయాంలో జగన్ అండ్ కో ఇసుక మాఫియా ద్వారా రూ.50వేల కోట్ల అవినీతి జరిగిందని శ్రీకాళహస్తి ఎంఎల్ఎ బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి విమర్శించారు. ఇసుకను బొక్కి జగన్, పెద్దిరెడ్డి ఖజానాలను నింపిన జేపీ కంపెనీపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఎన్టీఆర్ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ కూటమి తీసుకొచ్చిన ఉచిత ఇసుక పాలసీ పేదలకు ప్రయోజనం చేకూరుస్తుందన్నారు. భవన నిర్మాణ రంగం పుంజుకుని కార్మికులు మూడు పూటలా తినగలుగుతారన్నారు. కాసా గార్డెన్ రెసిడెన్షియల్ స్కూలుకు కజారియా పరిశ్రమ సహకారంతో ఒక బ్లాక్ నిర్మించి వినియోగంలోకి తెస్తామన్నారు. ఇకపై సోమవారం నుంచి శుక్రవారం వరకూ పంచాయతీరాజ్ అతిథిగృహంలో అందుబాటులో ఉంటానని చెప్పారు. ఓటిపి సాయంతో 48 గంటల్లోగా సమస్య పరిష్కారం అయ్యేలా యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మాజీ ఎంఎల్ఎ బియ్యపు మధుసూదన్‌రెడ్డి భూబాధితులకు మూడు రోజుల సమయం ఇస్తున్నానని, వారందరూ వచ్చి తనను నేరుగా కలిస్తే వారికి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. శ్రీకాళహస్తి ప్రెస్‌క్లబ్‌కు శాశ్వత భవన నిర్మాణానికి త్వరలో స్థలాన్ని కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో టిడిపి నేతలు మునిరాజానాయుడు, రంగినేని చెంచయ్యనాయుడు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డు నుంచి టన్ను రూ.590 : కురుగొండ్ల

వెంకటగిరి రూరల్ : మొగళ్లగుంట డంపింగ్‌యార్డులో ఉచిత ఇసుక పంపిణీ కార్యక్రమాన్ని ఎంఎల్ఎ కురుగొండ్ల రామకృష్ణ ప్రారంభించారు. ప్రస్తుతం మొగళ్లగుంట డంపింగ్‌యార్డు నుంచి వెయ్యి కేజీల ఇసుక రూ.590 రూపాయలకే ఆన్లైన్ పేమెంట్ ద్వారా ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నీలకంఠేశ్వరరావు, నాయకులు పప్పు చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం : ఎంఎల్ఎ

దొరవారిసత్రం : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట ప్రకారం ఉచిత ఇసుక పాలసీ విధానాన్ని తీసుకొచ్చారని ఎంఎల్ఎ విజయశ్రీ అన్నారు. దొరవారి సత్రం జాతీయ రహదారి పక్కనే ఉన్న నేతాజీనగర్ ఇసుక స్టాక్ పాయింట్ వద్ద ఇసుక సరఫరాకు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ చంద్రముని, నాయకులు వేమసాని శ్రీనివాసులునాయుడు, డిటి గోపీనాథ్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.



ఉత్తరాదిన వర్షం... 'నిమ్మ' కు నష్టం

ప్రజాశక్తి - బాలాయపల్లి

ఉత్తరాది రాష్ట్రాల్లో వర్షాలు నిమ్మరైతును ముంచేశాయి. గూడూరు మార్కెట్లో కిలో నిమ్మకాల ధర రూ.20-30 లోపే పలుకుతోంది. ఈ ఏడాదిలో ఈ ధర అతి తక్కువ కావడం గమనార్హం. రెండు మూడు నెలల క్రితం వరకూ కాయ రూ.5-7 ధర పలకగా, ఇంతలోనే ఈ విధంగా ధర పడిపోవడం నిమ్మ రైతును కుంగదీసింది. గూడూరు డివిజన్ నుంచి ఎక్కువగా నిమ్మకాయలు ఢిల్లీకి ఎగుమతి అవుతాయి. అయితే కొద్ది రోజులుగా దేశ రాజధానిలో వర్షాలు పోటెత్తుతుండడంతో నిమ్మ మార్కెట్ స్తంభించింది. మిగతా ఉత్తరాది ప్రాంతాల్లోనూ వర్షాలు కురుస్తుండడంతో ఒక్కసారిగా ధరలు కుప్పకూలాయి. పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని నిమ్మ రైతులు వాపోతున్నారు. ఆదివారం మార్కెట్‌కు నిమ్మకాయలు తీసుకొచ్చిన అన్నదాతలకు అక్కడి ధర నిరాశను మిగిల్చింది. కూలి ఖర్చులు రాకపోవడంతో రైతులు నైరాశ్యంతో వెనుదిరిగారు. కొత్తగా కొలువు తీరిన కూటమి ప్రభుత్వం నిమ్మ రైతును ఆదుకోవాలని కోరుతున్నారు. గూడూరు డివిజన్ పరిధిలో 40వేల ఎకరాల్లో నిమ్మ సాగవుతోంది. గత ఏడాది పశువుల ఎరువు ట్రాక్టర్ రెండువేలు ఉండేది. ఈ ఏడాది మూడువేలు పెంచారు. ఎకరాకు రూ.20-30వేలు ఖర్చవుతుంది. ప్రస్తుతం వేరుకుళ్లు, బుజు తెగులు వల్ల చెట్లు ఎండిపోయి పూత తగ్గి, దిగుబడి పడిపోయింది. ఎకరాకు 10 డిక్కీలు (400 కిలోలు) మాత్రమే దిగుబడి వచ్చింది. అయితే పెట్టుబడిలో ఒక వంతు కూడా రాలేదని, దీంతో కాయలు కోయడానికి కూలి ఖర్చులు దండగని రైతులు కాయలను వదిలేస్తుండటం గమనార్హం.

కిలో రూ.20-30లోపే..



అధిక వర్షం ముంచేసింది : అమీర్ సాయిబాబా, గొట్టికాడు

ఈ ఏడాది వర్షాలు అధికంగా పడుతున్నాయి. ఉత్తరాదిని వర్షాలు ముంచెత్తుతున్నాయి. సహజంగా గూడూరు మార్కెట్ నిమ్మ ఎక్కువ భాగం ఢిల్లీకి ఎగుమతి అవుతుంది. దాదాపు 250 నిమ్మచెట్లు సాగు చేస్తున్నాను. ఈ ఏడాది ఎకరాకు 20-40వేలు పెట్టుబడి పెట్టాను. కనీసం 15వేలు కూడా చేతికి రాలేదు.

పెట్టుబడులు పెరిగాయి : అనీల్, అంబలపూడి

ఈ ఏడాది ఉత్తరాది రాష్ట్రాల్లో అధికంగా వర్షాలు పడుతుండడంతో నిమ్మ ధర అమాంతం పడిపోయింది. మాకు 300 నిమ్మచెట్లు ఉన్నాయి. పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు. పశువుల ఎరువు, రసాయన ఎరువులు అధిక రేట్లు పెంచేశారు. దీంతో అప4లు చేసి నిమ్మచెట్లను కాపాడువాల్సిన పరిస్థితి.

నేడు ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్ల ధర్నా

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ట్రాన్స్ పోర్ట్ రంగంలో పనిచేస్తున్న డ్రైవర్లకు ఉరితాడుగా మారిన కొత్త చట్టాల ఉపసంహరణకై సిఐటియు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నట్టు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని రంగాలకు చెందిన డ్రైవర్లతో భారీ ధర్నా కార్యక్రమం బుధవారం ఉదయం తిరుపతి కలెక్టరేట్ వద్ద జరుగుతుంది. ఉదయం 11 గంటలకు జరిగే ధర్నా కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి ట్రాన్స్‌పోర్టు రంగంలో పనిచేసే డ్రైవర్లు పాల్గొంటారని తెలిపారు.

నేడు దేశవ్యాప్త కార్మికుల కోర్కెల దినోత్సవం

ప్రజాశక్తి -సత్యవేడు

నేడు దేశవ్యాప్తంగా కార్మికుల కోర్కెల దినోత్సవం నిర్వహిస్తోందని, సత్యవేడు తహశీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించే నిరసన కార్యక్రమానికి కార్మికులు పెద్దఎత్తున హాజరు కావాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మెలుగు రమేష్ కోరారు. నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, ప్రైవేటీకరణను, జాతీయ నగదు బదిలీ పథకాన్ని ఆపాలని అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు, వెలుగు, మెప్మా, ఉపాధి హామీ, ఆయుష్, 108, 104 కార్మికులందరూ ఏకతాటిపైకి వచ్చి నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

తోపుడుబండ్ల వ్యాపారుల తొలగింపు అన్యాయం : సిఐటియు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

కరకంబాడి రోడ్డులోని తోపుడుబండ్ల వ్యాపారుల ఉపాధిపై దెబ్బకొట్టే వైఖరిని మానుకోవాలని సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. తోపుడుబండ్ల వ్యాపారులపై దాడులు చేయడం సరికాదన్నారు. దాదాపు 15-20 ఏళ్లుగా తోపుడుబండ్లనే నమ్ముకుని బతుకున్నారని తెలిపారు. హఠాత్తుగా వ్యాపారాలు చేసుకోడానికి వీల్లేదంటే వారు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. మంగళవారం లీలామహల్ నుంచి బొంతాలమ్మ గుడి వరకూ ఉన్న తోపుడుబండ్లను సరుకు ఉన్నా బలవంతంగా తొలగించే చర్యలు చేపట్టారన్నారు. ఇదే దూకుడు కొనసాగితే తోపుడుబండ్ల వ్యాపారుల ప్రతాపం చూపిస్తామని, మున్సిపల్ కార్యాలయాన్ని తోపుడుబండ్లతో ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఇఎస్ఐలో కేంద్రబృందం పరిశీలన

తిరుపతి సిటి : ఇఎస్ఐ ఆస్పత్రిని కేంద్ర ఇఎస్ఐ బృందం మంగళవారం పరిశీలించింది. కేంద్ర ఈఎస్ఐ డైరెక్టర్ తిరుపతి, రేణిగుంటకు వచ్చిన నేపథ్యంలో బిఎంఎస్ తిరుపతి జిల్లా కమిటీ ఈఎస్ఐ హాస్పిటల్‌లో ఎన్నో ఏళ్లుగా అపరిష్కతంగా ఉన్న, శిధిలావస్థలో ఉన్న ఆసుపత్రి భవనం, రోగ నిర్ధారణ సౌకర్యాల కొరత, డిస్పెన్సరీ అసమంజసమైన పనితీరు, ఈఎస్ఐ బెనిఫిట్ సీలింగ్ తదితర సమస్యల పైన వినతి పత్రం అందజేశారు. .విజ్ఞాపనలో అంశాలను పరిశీలించిన కేంద్ర ఈఎస్ఐ బందం సమస్యల పరిష్కారం పై సానుకూలంగా స్పందించింది. ఈ కార్యక్రమంలో బిఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి బిల్లె శీనప్ప, కమిటీ సభ్యులు సుబ్బారావు, స్వర్ణలత పాల్గొన్నారు.

తిరుపతిలో గంజాయిని అరికట్టండి

డీజీపీకి జల్లి మధుసూదన్ వినతి



డిజిపిని కలిసిన జల్లి మధుసూదన్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ఏపీ నూతన డిజిపిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ద్వారకాతిరుమలరావును విజయ వాడ లోని డిజిపి కార్యాలయంలో తిరుపతికి చెందిన బిజెపి సీనియర్ నాయకులు జల్లి మధు సూదన్ మంగళవారం మర్యాద పూర్వకం గా కలిశారు. ఈ సందర్భంగా జల్లి మధుసూదన్ మాట్లాడుతూ ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతి లో గంజాయి విక్రయాలు, వినియోగం మితిమీరు పోయా యన్నారు. మాదక ద్రవ్యాలకు బానిసలు అయిన యువత, వారి భవిష్యత్తును నాశనం చేసుకుని పెడదారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతి జిల్లాలలో లభ్యమయ్యే ఎర్రచందనం సైతం, స్మగ్లర్లు విపరీతంగా దోచుకుంటు న్నారని డీజీపీ దృష్టికి తీసుకువచ్చారు. తిరుపతి వంటి పుణ్యక్షేత్రంలో ఇలాంటి వాటి కి తావివ్వకుండా వెంటనే అరికట్టాలని కోరారు. ఆయన వినతిపై డిజిపి సాను కూలంగా స్పందించారు.

ఎన్‌టిఆర్ విగ్రహానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రత్యేక ప్రతిభావంతులకు మూడు వేల నుంచి ఆరువేల రూపాయలు పెన్షన్ ఇస్తామని చెప్పిన మేరకు ప్రభుత్వం చేపట్టిన నెల రోజులకే వారికి 3వేలనుంచి 6 వేల రూపాయలు పెన్షన్ పెంచారు. దీంతో పాకాల ఆర్‌టిసి బస్టాండు సమీపంలోని ఎన్‌ఆర్‌టిఆర్ విగ్రహానికి ప్రత్యేక ప్రతిభావంతులు పాలాభిషేకం చేసి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ప్రతిభా వంతుల కమిటీ సభ్యులు పాకాల మోహన్ బాబు, యస్ జ్యోతిఈశ్వర్ బాబు, యస్ నరసింహారెడ్డి, లలిత, మునేంద్ర బాబు, షౌకత్, వెంకటేష్ పాల్గొన్నారు.

వేదవ్యాస విద్యానికేతన్ పాఠశాల ప్రారంభం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు మున్సిపాల్టీ పరిధిలో ఏఎంసి కళ్యాణ మండపం ఎదురుగా ఉన్న నూతన వేద వ్యాస విద్యా నికేతన్ పాఠశా లను ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ మంగళవారం ప్రారం భించారు. ఈ సందర్భం గా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేదవ్యాస విద్యాని కేతన్ పాఠశాలలో విద్యార్థులు చదువు కొని ఉన్నత స్థాయికి వెళ్లారని. వేదవ్యాస అనేక సేవా కార్యక్రమాలు చేస్తోందని పేర్కొన్నారు. పాఠశా లలో విశాలమైన వాతా వరణం వుందని తెలిపారు. వేదవ్యాస అధినేత మనోహర్ రాజు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రభుత్వ హాస్పిటల్ కి ఉచితంగా అంబులెన్సును అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేదవ్యాస విద్యా సంస్థ చైర్మన్ బాల సరస్వతి, వేద నారాయణ బాబు, వేదవ్యాస విద్యాసంస్థ డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ రజిని

ప్రజాశక్తి - క్యాంపస్ : విశ్వవిద్యాలయాల్లోని ఇన్నోవేషన్, ఇంకుబేషన్ సెంటర్ల ద్వారా విద్యార్థినీలు వనైపుణ్యాలలో పెంపొందించుకొని ఉన్నత రంగాలలో రాణించాలని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం కుల సచివులు ఆచార్య ఎన్. రజినీ పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఇన్నోవేషన్ అండ్ ఎంటర్ప్రెన్యూర్షిప్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ఎక్స్పోజర్ అండర్ ఇన్నిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ మెంటార్ మెంటి స్కీం 2023 -24, స్పాన్సర్డ్ బై మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇన్నోవేషన్ సెల్ న్యూఢిల్లీ శిక్షణను సావేరి అతిథి గృహంలో విసి ఆచార్య భారతి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ నాగరాజు వైస్ ప్రెసిడెంట్ ఐఐసీ, జి లతా ఐఐసి ఉప కార్యదర్శి, డాక్టర్ వైశాలి మెంటార్ మెంటి అధ్యక్షులు, డాక్టర్ రామకృష్ణ మెంటార్ మెంటి ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించండి : ఎంఈవో

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: బడి ఈడూ పిల్లలను బడిలో చేర్పించాలని మండల విద్యాశాఖ అధికారి మునిసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో నిర్వకోట వైసీ కాలనీ, కాంపాలెం వైసీ కాలనీ ఎంపీపీ పాఠశాల పరిధిలో ఎంఈవో మునిసుబ్రహ్మణ్యం పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో 'నేను బడికి పోతా' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలం లోని కాంపాలెం వైసి కాలనీలోని పాఠశాలలో బడి మానేసిన పిల్లలను ఉన్నత పాఠశాల పరిధిలో కాలనీలో బడి ఈడు పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంత రం నేర్పాకోట వైసీ పాఠశాలలో ఎంఈవో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం తిని నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్య యులు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని త్యాగరాజ వీధిలోని కళ్యాణ వీరభద్ర స్వామి ఆలయంలో మంగళవారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కళ్యాణ వీరభద్ర స్వామి అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు . ఉభయ దాతలుగా నీలిశెట్టి సత్యవతి కుమారులు ఉమాశంకర్ , రామకృష్ణ వ్యవ హరించారు.

ఎమ్మెల్యేను కలిసిన బలిజ సంఘం నాయకులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్‌ను పుత్తూరు పట్టణ బలిజ సంఘం నాయకులు తిరుపతిలోని ఎమ్మెల్యే గృహం వద్ద మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువా కప్పి ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఆ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థుల ఇచ్చేందుకు నోటు పుస్తకాలను ఎమ్మెల్యే చేతికి అందించారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు కృష్ణయ్య, విక్కీ రాయల్, రవికుమార్, జి బాబు, నాయకులు పాల్గొన్నారు.


కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టండి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతిలో ప్రైవేటు కార్పొరేట్ కళాశాలలు విద్యార్థుల తల్లిదండ్రుల నుండి ఫీజుల వసూళ్లలో నయా దందాను మొదలుపెట్టారని, ఫీజుల నియంత్రణ చట్టాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసి ఈ నయా దందాకు చెక్ పెట్టాలని గిరిజన నవ సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షులు పాలిత్య శివశంకర్ నాయక్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఇదే విషయమై ఆర్జెడి కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా శివ శంకర్ నాయక్ మాట్లాడుతూ కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థుల తల్లిదండ్రుల నుండి ఫీజులతో పాటు కాకుండా మెయింటెనెన్స్ చార్జీలు, ఇలా వివిధ రకాల పేర్లతో వసూళ్లు చేస్తున్నారని ఓ వైపు ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి పూర్తిగా ఫీజులు చెల్లిస్తేనే టీసీలు ఇస్తామంటూ విద్యార్థులకు మెలికలు పెడుతున్నారని తెలిపారు.

అక్రమార్కులపై విచారణ తథ్యం: నరసింహ యాదవ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): గత ప్రభుత్వ హయాంలో ప్రజాధనాన్ని దోచుకున్న వారిపై విచారణ చేపట్టడం తథ్యమని టిడిపి తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్ స్పష్టం చేశారు. తిరుపతి ప్రెస్ క్లబ్ లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయం తెలిపారు. స్మార్ట్ సిటీ నిధులతో చేపట్టిన కార్యక్రమాలలో అవినీతి జరిగిందని ఇప్పటికే గుర్తించామన్నారు. దీనిపై, తిరుమల తిరుపతి దేవస్థానంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన పనులపైనా విచారణ చేయిస్తామన్నారు. ఈ సమావేశంలో మనోహరాచారి, కట్టా జయరామయాదవ్, హేమంత్ యాదవ్, యశ్వంత్ రెడ్డి, మహేష్, వెంగయ్య పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం: ఎమ్మెల్యే



ప్రజాశక్తి -సత్యవేడు: అన్ని రంగాల్లో నియోజకవర్గ అభివృద్ధే తన ధ్యేయమని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. ప్రజల పక్షాన పోరాడుతు న్నందుకే నియోజకవర్గ ప్రజలు రెండో సారి తనను ఎమ్మెల్యేగా ఎన్నుకున్నారని ఆయన పేర్కొన్నారు. సత్యవేడు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ప్రతిమ అధ్యక్షతన, ఎంపీడీవో చంద్రశేఖర్ పర్యవేక్షణలో మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, జెడ్పిటిసి విజయలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిమూలం మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్నదే తన ధ్యేయం అన్నారు. ముఖ్యంగా నియోజకవర్గంలోని ప్రతి పంచాయతీలోనూ మౌలిక వసతులను మెరుగుపరచాల్సి ఉందన్నారు. ప్రతి గ్రామంలోనూ తాగునీరు, రోడ్లు, విద్యుత్తు అవసరాలపై అధికారులు దృష్టి సారించి పనిచేస్తే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్నారు. తాను ఇటీవల చిన్నపాండూరు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన సమయంలో 14 మంది సిబ్బంది ఉన్నా కనీసం ఒకరు కూడా లేరన్నారు. దీనిపై సంబంధిత మెడికల్ డాక్టర్ అనితను వివరణ కోరగా పొంతన లేని సమాధానం చెప్పడం బాధాకరమన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి ప్రజా ప్రతినిధులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని ఆయన అధికారులను కోరారు. కొండూరు డిఈ స్థాయి అధికారులు సర్వసభ్య సమావేశానికి హాజరుకాకపోవడం పట్ల ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా అధికారులతో ఆయా శాఖల సమస్యలపై చర్చించారు.

పెద్దపులులకు అభయారణ్యం శేషాచలం

● నల్లమల నుండి శేషాచలం వైపు ఆగమనం ● క్రమంగా పెరుగుతున్న సంఖ్య



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): నల్లమల టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ నుండి శేషాచలం అడవుల వైపు పెద్దపులి ఆగమనం మొదలయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. జాతీయ జంతువుగా గుర్తింపు పొందిన పెద్దపులి ఒకానొక దశలో అంతరించిపోయే జాబితాలో చేరింది. దీంతో ఎలాగైనా పెద్దపులి సంతతిని పెంచుకునేలా అధికారులు కర్నూలు నాగార్జునసాగర్ వద్ద ఉన్న పెద్దపులుల అటవీ ప్రాంతాన్ని రాజీవ్ అభయారణ్యంగా ప్రకటించారు. శేషాచలం అడవుల్లో పెద్ద పులులు విస్తరిస్తున్నా వాటి సంతతికి తగ్గట్టు ఆవాసాలను ఏర్పాటు చేసుకోవడానికి అనువైన కొండ ప్రాంతాలు, దట్టమైన చెట్ల సమూహ ప్రాంతాలు ఉండడంతో శేషాచలం అడవి వైపు వాటి ఆగమనం అతి త్వరలో మొదలవుతుందని అటవీ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పెద్ద పులులు శేషాచలం అడవిలోకి వచ్చేలా కారిడార్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు అప్పటి అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రకటించారు. దీనిపై అసలే తిరుమలలో యాత్రికులపై చిరుతలు దాడి చేసి ప్రాణాలు తీస్తుంటే, ఇది చాలదన్నట్లు పెద్ద పులుల రాకకు కారిడార్లు ఏర్పాటు చేస్తారని పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి.

శేషాచలం వైపు అడుగులు

నాగార్జునసాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వ్ ఫారెస్టు నుంచి శేషాచలం రిజర్వ్ ఫారెస్ట్‌లోకి వచ్చే లంకమల శాంచరీ వద్ద పెద్దపులిని అటవీశాఖ అధికారులు గుర్తించినట్టు సమాచారం. ఇప్పుడిప్పుడే పెరుగుతున్న పెద్దపులుల సంతతికి ఆవాసాలను వెతుక్కునే క్రమంలో పెద్ద పులులు శేషాచలం రిజర్వు ఫారెస్ట్ లోకి వచ్చే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అయితే ఇప్పటి వరకు శేషాచలం అటవీ పరిధిలో అటవీశాఖ ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాలలో ఎక్కడా పెద్దపులుల జాడలు నిక్షిప్తం కాలేదు.

సంతతి తగ్గుముఖం పట్టడంతో..

నల్లమల అటవీ ప్రాంతంలో పెద్దపులుల సంతతి తగ్గు ముఖం పట్టడంతో రాజీవ్ అభయారణ్యంగా అటవీశాఖ అధికారులు ప్రకటించి పులుల రక్షణకు చర్యలు చేపట్టారు. అటు తర్వాత నేటికీ పెద్ద పులుల సంఖ్య 80 దాకా చేరింది. ఇవి శేషాచలం అటవీ ప్రాంతంలోకి ప్రవేశిస్తే వీటి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

పెద్దపులులకు మరో అభయారణ్యంగా..

నల్లమల అడవుల్లో విస్తరిస్తున్న పెద్ద పులులు శేషాచలం అడవులను మరో అభయారణ్యంగా ఎంచుకోనున్నాయని తెలుస్తోంది. శేషాచలం అటవీ ప్రాంతంలో ఎన్నో ఔషధ మొక్కలు, జీవవైవిధ్యానికి అవసరమైన వనరులు, సాధు జంతువులు ఇలా అనేకం జీవిస్తున్నాయి. పెద్దపులి ఆగమనం జరిగితే సాధు జంతువుల సంతతి తగ్గు ముఖం పట్టడం ఖాయం. పెద్ద పులులకు ఆహారం అధికంగా అవసరం ఏర్పడే నేపథ్యంలో శేషాచలం అడవుల్లో ఇప్పటికీ స్వేచ్ఛగా తిరుగుతున్న సాధు జంతువులు ఆహారంగా మారక తప్పదు.

పెనుశిల నరసింహస్వామి శాంచరిలోకి..

ఇటీవల నల్లమల అటవీ ప్రాంతం నుండి పెద్ద పులులు నెల్లూరు జిల్లా పెనుశిల నరసింహస్వామి శాంచరీ పరిధిలోకి పెద్ద పులులు ప్రవేశించినట్లు అధికారులు గుర్తించారు. ఈ ప్రాంతం నుండి శేషాచలం అటవీ పరిధిలోకి పెద్ద పులులు రావడానికి పెద్ద సమయం తీసుకునే పరిస్థితులు లేదన్నారు. పెరుగుతున్న సంతతికి తగ్గట్టుగా వాటి ఆవాస కేంద్రాలను ఏర్పాటు చేసుకునే క్రమంలో సమీపంలో ఉన్న శేషాచలం అడవుల్లోకి రావచ్చని అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు. ఇటీవల పలనాడు జిల్లా నల్లమల అటవీ ప్రాంతానికి ఆనుకొని కొన్ని మండలాల పరిధిలో పెద్దపులి సంచరించినట్లు అక్కడి ప్రజలు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. పెద్దపులి సంచారంతో ఆయా ప్రాంతాల్లో అటవీశాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నట్లు తెలుస్తోంది.

ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్టు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం), రామచంద్రాపురం: శేషాచలం అటవీ పరిధిలోని శ్రీవారిమెట్టు వైపు అడవుల్లోకి చొరబడుతున్న కొందరు స్మగ్లర్లను టాస్క్ ఫోర్సు పోలీసులు అడ్డుకుని, ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేశారు. అదుపులోకి తీసుకున్న స్మగ్లర్ల నుండి కారు, రంపాలు, గొడ్డళ్లు స్వాధీనం చేసుకున్నామని అధికారులు తెలిపారు. టాస్క్ ఫోర్స్ ఆర్ఎస్ఐ విష్ణువర్ధన్ కుమార్ మంగళవారం కళ్యాణీడ్యామ్ వైపు వెళ్లి శ్రీవారిమెట్టు వైపు కూంబింగ్ చేపడుతుండగా, నాగపట్ల సెక్షన్ పరిధిలో ఒక కారు నుంచి కొంత మంది వ్యక్తులు దిగడం గుర్తించామన్నారు. దీంతో వారిని టాస్క్ ఫోర్సు పోలీసులు వెంబడించి ఇద్దరు స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నామన్నారు. తమిళనాడు వేలూరు జిల్లా ఆనైకట్టుకు చెందిన శక్తివేల్ (29), రాజేంద్రన్ చిన్నపయ్యన్ (53)లుగా గుర్తించామన్నారు. వారిని విచారించగా, తిరుపతి సమీపంలోని అడవుల్లో ఎర్రచందనం చెట్లను నరకడానికి అదే ప్రాంతానికి రాజశేఖర్ అనే మేస్త్రీ తమను తీసుకుని వచ్చినట్లు వివరించారన్నారు. తెలిపారు. పారిపోయిన శెల్వరాజ్, రాజశేఖర్, గోపి, శీను, గోవిందన్ ల కోసం గాలింపులు చర్యలు చేపట్టామని టాస్క్ ఫోర్స్ అధికారులు తెలిపారు. టాస్క్ ఫోర్సు సిఐ సురేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారన్నారు.

దోపిడీ కేసులో నిందితులకు జైలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: దోపిడీ కేసులో ముగ్గురు నిందితులకు 5 సంవత్సరాల 6 నెలలు జైలు శిక్ష, 3వేల రూపాయలు జరిమాన విధిస్తూ ఏఎస్జె కోర్ట్ జడ్జి మంగళవారం తీర్పు ఇచ్చారు. తమిళనాడు విల్లుపురం జిల్లాకు చెందిన సంగరాజు , తిరుపూర్ జిల్లాకు చెందిన దొరస్వామి, చెన్నై మెరీనా బీచ్ కు చెందిన కాజా మొహిద్దీన్ షాజహాన్ తిరుపతిలో యాచక వృత్తితో జీవనం సాగించేవారు. బాలాజీ లింకు బస్టాండు వద్ద, మంగళం కు చెందిన చెందిన అనీష్ యాత్రికులకు మొబైల్ కి చెందిన పరికరాలు విక్రయించేవాడు. 2023 అక్టోబర్ 11వ తేదీ రాత్రి 10.30 గంటలకు ఎవరో గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు ఇతని వద్దకు వచ్చి ఉన్న డబ్బులు, మొబైల్ ఆక్సిసోరీస్ ఇమ్మని బెదిరించాడు. నిరాకరించినందుకు, వెంటనే ఇనుప రాడ్డు, కత్తులు, బ్లేడ్ లతో పై వ్యక్తి పై దాడి చేసి గాయపరిచారు. రక్తపు మడుగులో ఉన్న అనీష్ వద్ద ఉన్న డబ్బుల, పర్సు, మొబైల్ ఆక్సిసోరీస్ ఉన్న బ్యాగును బలవంతంగా లాక్కొని పారిపోయినారు. మనీ పర్సులో 13వేలు, బ్యాగులో సుమారు 4వేలు విలువచేసే మొబైల్ ఆక్సిసోరీస్ దోచుకెళ్లారు . సమాచారం అందుకున్న అప్పటి సీఐ . అబ్బన్న తిరుపతి రుయా ఆసుపత్రిలో గాయపడిన వ్యక్తిని చేర్చాడు. కేసు దర్యాప్తు చేసి 2023, అక్టోబరు 14వ తేదీ అరెస్టు చేసి, వారి వద్ద చోరీ సొత్తు, ఉపయోగించిన మరణాయుధాలను స్వాధీనం చేసుకుని చిత్తూరు పిఎస్‌జె కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో, న్యాయమూర్తి వారికి జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ కేసు నిరూపణలో కృషి చేసిన దర్యాప్తు అధికారులు అబ్బన్న (అప్పటి అలిపిరి సీఐ), జయచంద్ర ఎస్ఐ, చిత్తూరు కోర్ట్ ఏపీపీ శైలజ, కోర్టు సిబ్బంది పీసీ ప్రభాకర్, హెచ్ సి నాగరాజు లను ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు అభినందించారు.

ఎస్వీయూలో ఎన్నికల సందడి !

- పోటీ అభ్యర్థుల విస్తృత ప్రచారం



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం బోధినేతర సిబ్బంది సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఐదు సంవత్సరాలకు నిర్వహించే ఎన్నికలకు గత వారం రోజుల క్రితం ఎన్నికల అధికారి మహమ్మద్ షఫీ నోటిఫికేషన్ జారీ చేశారు. ఇందులో భాగంగా కీలకమైన అధ్యక్షుడు సెక్రటరీ పదవులకు ముగ్గురు వ్యక్తుల చొప్పున తీవ్రమైన పోటీ నెలకొంది. అధ్యక్షుడు ఎన్నికకు పోటీలో ఏ.గురుమూర్తి శంఖం, బి వెంకటేశ్వర్లు నిచ్చెన, గుర్రంకొండ శ్రీధర్ కు సింహం గుర్తులను కేటాయించారు. ఈ ఎన్నికల్లో కార్యదర్శిగా పోటీలో నెల్లూరు సుబ్రహ్మణ్యం (సుబ్బు) గౌను, కాళహస్తి రవిచంద్ర గొడుగు, ఈ. చంద్రశేఖర్ గంట, గుర్తులను కేటాయించారు. ఎలాంటి ఎన్నికలు నిర్వహించకుండానే బోధనేతర సంఘం మహిళా ప్రతినిధిగా ఎం.కృష్ణకుమారి, ఎస్వియు ఆరోగ్య విభాగం నుంచి ఆర్ ముత్యమేలు, వాచ్‌మ్యాన్ విభాగం నుంచి మదనమోహన్ రెడ్డి, ఎస్వియు క్యాంపస్ స్కూల్ నుంచి అమ్మని, ఎస్వీయూ నర్సరీ స్కూల్ నుంచి టి.సుదర్శనమ్మ తోపాటు 17 మంది ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దూర విద్యా విభాగం నుంచి ప్రసాద్ బాబు లీలా కృష్ణారెడ్డిల మధ్య గట్టి పోటీ నెలకొని ఉంది. మొత్తం ఎస్వియూ క్యాంపస్‌లో దాదాపు 300 పైచిలుకుగా శాశ్వత బోధనేతర సిబ్బంది పనిచేస్తున్నారు. ఈ ఎన్నికలలో వారి ఓట్ల కోసం అధ్యక్ష, కార్యదర్శుల అభ్యర్థులు, ఈసీ మెంబర్ అభ్యర్థులు గత నాలుగు రోజులుగా తీవ్రంగా ప్రచారాలలో మునిగి తేలుతున్నారు. ఈ సారి జరిగే ఎన్నికలలో నూతన అభ్యర్థులకు అవకాశం ఇవ్వాలని కొంతమంది భావిస్తున్నట్లు సమాచారం. గతంలో వివిధ స్థానాలలో గెలుపొందిన అభ్యర్థులు తమకు ఎటువంటి సహాయ, సహకారాలు అందించలేదని, శాశ్వత విధులు నిర్వహించే సిబ్బంది ప్రమాదవశాత్తు మరణిస్తే వారికి ఎటువంటి ఆదరణ చూపలేదని కొంతమంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల అప్పుడు చేసిన హడావుడి గెలిచిన తర్వాత నాయకులు చూపలేదని ఒక వర్గం వారు ఆరోపిస్తున్నారు. అంతేకాదు బోధనేతర సిబ్బంది ఆఫీసుల్లో పలు రకాలైన సమస్యలను, వేధింపులను పరిష్కరించే ఉన్నత కమిటీలు లేకపోవడం బాధాకరమన్నారు. ఈసారి ఎన్నికలలో అధ్యక్ష కార్యదర్శులకు త్రిముఖమైన పోటీ తీవ్రస్థాయిలో నెలకొని ఉంది. వర్సిటీ వర్గాల్లో ఎవరు గెలుస్తారని ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. సాధారణ ఎన్నికలలో లాగానే ప్రస్తుతం ఎస్వీయూలో ఓటరు నాడిని ఎవరు గుర్తించలేని పరిస్థితిగా ఉంది. అయితే ఎస్వీయూలో ప్రచారంలో అభ్యర్థులు నిరంతరం పోటీ పడుతున్నట్లు కనిపిస్తోంది.

షార్ ప్రతిష్టను దిగజార్చొద్దు: జెవివి



మాట్లాడుతున్న జెవివి నాయకులు

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ షార్ సెంటర్ కీర్తి ప్రతిష్టలను దిగజారుస్తున్న వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని జెవివి సెక్రటరీ రామ్మూర్తి పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అంతరిక్ష పరిశోధన రంగంలో ప్రపంచంలో అగ్రగామిగా నిలుస్తూ శాస్త్ర సాంకేతిక రంగాలలో మన దేశానికి తలమానికమై దేశంలో అత్యున్నతమైన సంస్థగా పేరుందిన సంస్థ ఇస్రో అందులో విభాగమే షార్ సెంటర్. ఇటీవల కాలంలో నిరుద్యోగ సమస్యలు ఆసరాగా చేసుకుని షార్ సెంటర్లో కొలువులు ఇప్పిస్తామని నిరుద్యోగ యువత దగ్గర లక్షల రూపాయలు వసూలు చేసినట్లు సమాచారం వచ్చిందని దీనిపై నాయుడుపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారని, కలెక్టర్ , ఎస్పీ ప్రజా ప్రతినిధులు, స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు, స్పందించి దోషులపై వెంటనే చర్య తీసుకోవాలని బాధితు లకు న్యాయం చేయా లని కోరారు. ఈ కార్యక్ర మంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు ప్రసిడెంట్ కె. రాజేష్ బాబు, సామ్యూల్, నాగరాజు, రామారావు, జయ రాములు పాల్గొన్నారు.

బిఎస్‌ఎన్‌ఎల్ ఫోర్ జి సేవలను విస్తరించండి : ఎంపి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: బిఎస్ఎన్ఎల్ 4జి సేవలను తిరుపతి జిల్లాలో విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంపి డాక్టర్ గురుమూర్తి తెలిపారు.మంగళవారం తిరుపతిలోని ఆయన కార్యాలయంలో బిఎస్ఎన్ఎల్ అధికారులు కలిశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వాకాడు మండలం పూడిరాయదొరువు, తడ మండలం ఇరకం, నాగలాపురం మండలం నందనం గ్రామాలలో నిర్మించ తలపెట్టి పెండింగులో ఉన్నటు వంటి బిఎస్ఎన్ఎల్ సెల్ ఫోన్ టవర్ల గూర్చి ఎంపీ గురుమూర్తి వారిని అడిగి తెలుసుకొన్నారు. పూడిరాయదొరువు, ఇరకం గ్రామాలకి సంబంధించి వైల్డ్ లైఫ్ నుంచి అనుమతులు, అలాగే నాగలాపురం మండలం నందనం గ్రామానికి సంబందించి పనులు పురోగతిలో ఉన్నాయని తెలియజేసారు. పూడి రాయదొరువు, ఇరకం గ్రామాలకి రెండు టవర్లకి సంబంధించి వైల్డ్ లైఫ్ అధికారులతో మాట్లాడి త్వరితగతిన పూర్తి చేయవలసినదిగా తన వ్యక్తిగత కార్యదర్శిని ఆదేశించారు. వీటి తోపాటుగా నందనం టవర్ కూడా త్వరగా వినియోగంలోకి తీసుకురావాలని వారిని కోరారు. ఎంపీ మాట్లాడుతూ తిరుపతి నగరంలో ప్రస్తుత జనాభా అయిదు లక్షల కంటే ఎక్కువ ఉన్నారని, ఇంటి అద్దె కూడా ఎక్కువగా ఉన్న దష్ట్యా తిరుపతి పట్టణాన్ని "జడ్" కేటగిరి నుండి "వై" కేటగిరి కి మార్పు చేసినట్లయితే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకి ఉపయుక్తంగా ఉంటుందని ఇందుకు సంబంధించి ఇది వరకే సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడామని మరోసారి వారిని కలిసి విన్నవిస్తామని తెలియజేసారు.

ప్రజల సంక్షేమం లక్ష్యం: ఎమ్మెల్యే



ఎమ్మెల్యే విజయశ్రీని, నెలవల సుబ్రమహ్మణ్యంను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: ప్రజల సంక్షేమం, అభివృద్ధే తమ లక్ష్యం అని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. పెళ్లకూరు ఎంపీడీవో కార్యాలయంలో టిడిపి మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య ఆధ్వర్యంలో ఆ పార్టీ ఇన్‌ఛార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం అధ్యక్షతన విజయోత్సవ అభినందన సభ మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలో ప్రతి గ్రామ పంచాయతీ నుండి పెద్ద సంఖ్యలో మండల నాయకులు, సీనియర్ నాయకులు ఎమ్మెల్యే విజయశ్రీకి శాలువాలు కప్పి పూల మాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెళ్లకూరు మండలంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు ఇలా సన్మానిం చడం తనకు ఆనందంగా ఉందని గత మూడు అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి వెనకబడి ఉందని అలాంటి పరిస్థితిని అధిగమించి ప్రతి కార్యకర్త తన సొంత బాధ్యతతో వ్యవహరించి తనకు పూర్తి మెజారిటీకి కృషి చేశారన్నారు. మండల అభివృద్ధి, ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేసి వాళ్ల సంక్షేమానికి ఎల్ల వేళలా అందుబాటులో ఉంటానని ఆమె తెలిపారు. అనంతరం మండల స్థాయి అన్ని శాఖల సమీక్ష కార్యక్రమాలు నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి దేవేందర్ రెడ్డి, ఎంపీపీ శేఖర్ రెడ్డి , ప్రిస్కిల్లా, సీనియర్ నాయకులు విజయభాస్కర్ రెడ్డి, పేరం రమేష్ నాయుడు, మధు నాయుడు పాల్గొన్నారు.

'మాజీ ఎమ్మెల్యే అవినీతిపై న్యాయ విచారణ జరపండి'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: గత వైసీపీ ప్రభుత్వ పాలనలో శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కూడబెట్టిన అక్రమాస్తులు, సాగించిన అవినీతి, అక్రమాలపై సమగ్ర న్యాయ విచారణ జరపాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆర్ హరికృష్ణ డిమాండ్ చేశారు. తాను అధికారంలోకి వస్తే గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు చేపడతానని ప్రస్తుత ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఇచ్చిన ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని సూచించారు. శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పోలీస్, రెవెన్యూ, ఆలయం, ఇంకా పలు ప్రభుత్వ శాఖల అధికారులను దళారులుగా మలుచుకుని మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి సాగించిన అవినీతికి హద్దే లేదని, గుడి, బడి, ఇసుక, మైనింగ్, భూ దందాలు చేశారన్నారు. ఆఖరి సమయంలోనూ రాజీవ్ నగర్ లో 16 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని ఆ భూమిని స్వాధీనం చేసుకోకుంటే తామే పేదల సమక్షంలో జెండాలు పాతి గుడిసెలు వేస్తామని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే, ఆయన పీఏ అవినీతిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలోఅఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రామిశెట్టి వెంకయ్య, సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకటరత్నం రైతు సంఘం జిల్లా నాయకుడు మోహన్ నాయుడు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాతృత్వ సురక్ష వందన కార్యక్రమంలో మండలంలోని గర్భిణులందరికీ రక్త పరీక్షలు, గర్భస్థ పరీక్షలు నిర్వహించిన తగిన మందులు, ఐరన్ మాత్రలు అందించారు. ఆరోగ్య సలహాలు ఇచ్చారు. ప్రతి గర్భిణి రెండు వాయి సూదు లు, వంద ఐరన్ మాత్రలు, కాల్షియం మాత్రలు రెండుసార్లు, సాధారణ స్కానిం గ్ ఒక టిఫా స్కానింగ్ , ప్రతి నెల ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు నిర్వహించుకో వాలని సూచించారు. గర్భిణి మొదటి ప్రసవానికి ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన ద్వారా ఐదువేల రూపాయలు మూడు విడతలుగా గర్భిని అకౌంట్‌కు జమచేస్తారని తెలిపారు. జననీ సురక్ష యోజన ద్వారా ప్రభుత్వ వైద్యశాలలో కాన్పు అయిన వారికి వెయ్యి రూపాయలు, ఆరోగ్య ఆసరా ద్వారా కొంత నగదు వారి అకౌంట్లకు రెండవ కాన్పు ఆడబిడ్డ వారికి జమ చేస్తారని పేర్కొ న్నారు. ఈ సదుపాయాలను ప్రతి ఒక్కరూ విని యోగించు కోవాలని సూచించారు. ప్రతి కాన్పు ఆస్పత్రిలోనే నిర్వహించు కోవాలని తల్లి బిడ్డ క్షేమంగా ఉండాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పోషకాహారాన్ని సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పివి దివాకర్, డిఎన్ వెంకటేశ్వర్లు, సూపరువైజరు జ్యోతి, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ఎస్డీకే నగర్‌లో భారీ చోరీ

రూ.3.50 లక్షల నగదు, 40 సవర్ల బంగారం అపహరణ



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణంలోని దక్షిణ కైలాసనగర్లో సోమవారం అర్ధరాత్రి భారీ చోరీ చోటుచేసుకుంది. గుర్తుతెలియని దుండగులు ఓ ఇంటి తాళాలను పగలగొట్టి బీరువాలో దాచిన రూ.3.50 లక్షల నగదు, 40 సవర్ల బంగారు ఆభరణాలను అపహరించుకుని పోయారు. టూ టౌన్ సిఐ రారాజు కథనం మేరకు..దక్షిణ కైలాస నగర్ లోని ఓ అద్దె ఇంట్లో సిరాజ్ మిషా తన కుమారుడితో కలిసి నివాసం ఉంటోంది. ఆదివారం సాయంత్రం కుమారుడితో కలిసి చెన్నైలోని బంధువుల ఇంటికి వెళ్లింది. గుర్తు తెలియని దుండగులు సోమవారం అర్ధరాత్రి కట్టర్ల సాయంతో తాళాలను కత్తిరించి లోనికి ప్రవేశించారు. బీరువాలో దాచిన రూ.3.50 లక్షల నగదు, 40 సవర్ల బంగారాన్ని దోచుకుపోయారు. మంగళవారం ఉదయం సిరాజ్ మిషా ఇంటి తాళాలు తెరిచి ఉండడం చూసి స్థానికులు ఆమెకు సమాచారం అందించారు. చెన్నై నుంచి హుటాహుటిన ఎస్డీకే నగర్ కు చేరుకున్న సిరాజ్ మిషా ఇంట్లో చోరీ జరిగిందన్న విషయం తెలుకుంది. టూ టౌన్ పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు వచ్చి ఆధారాలు సేకరించారు. డాగ్ స్క్వాడ్ పరిశీలించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ సీఐ రారాజు తెలిపారు.

స్కూటరును ఢీకొన్న టిప్పర్

మహిళకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -రామచంద్రపురం :

స్కూటరును టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో మహిళ తీవ్రంగా గాయపడిన సంఘటన తిరుపతి రూరల్ మండలం రామాంజుపల్లి చెక్ పోస్ట్ వద్ద నాయుడుపేట- పూతలపట్టు జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు తిరుపతి రూరల్ మండలం పెరుమలపల్లి పంచాయతీ, కొప్పర వాండ్ల పల్లి చెందిన వి జీవన తన తమ్ముడితో ద్విచక్ర వాహనంలో రేణిగుంట లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఫీజు కట్టేందుకు వెళుతుండగా వెనుకవైపున రేణిగుంట వైపు వస్తున్న టిప్పరును డ్రైవర్ ఎల్ విజయ్ సింగ్ వేగంగా వచ్చి ఢీకొట్టడంతో టిప్పర్ ముందు చక్రం కింద ద్విచక్ర వాహనం పడడంతో జీవన కాలుకు తీవ్ర గాయం అయింది. ఎమ్మార్పల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ప్రమాదంలో జీవనాను చికిత్స నిమిత్తం 108 వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు. టిప్పర్ డ్రైవర్ విజయ్ సింగ్ ను పోలీసులు అదుపులో తీసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి బ్యాచ్ హల్‌చల్

-విద్యాసంస్థ బస్సుపై రాళ్లతో దాడి - కళాశాల బాలికలు బెంబేలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

మంగళంలో గంజాయి సేవించిన ఇద్దరు యువకులు మంగళవారం సాయంత్రం రోడ్లపై అడ్డుగా నిలిచి బీభత్సం సృష్టించారు. నారాయణ విద్యాసంస్థకు చెందిన బస్సును రాళ్లతో దాడి చేసి అద్దాలను పగలగొట్టారు. స్థానికులు, తిరుచానూరు పోలీసుల కథనం మేరకు నారాయణ విద్యాసంస్థలకు చెందిన బస్సు కళాశాలలో విద్యార్థినులను తీసుకొని రూట్పై వారి ఇళ్ల వద్దకు చేర్చడానికి మంగళం బిటిఆర్ కాలనీ 16వ లైన్ వద్దకు వచ్చారని, అక్కడ పూర్తిగా గంజాయి మత్తులో ఉన్న బిటిఆర్ కాలనీకి చెందిన బాలు, మహేష్ అనే యువకులు బస్సుకు అడ్డుగా నిలవడంతో డ్రైవర్ కుమార్ బస్సు హారన్ మోగించాడు. దీన్ని తప్పుబడుతూ సమీపంలోని రాళ్లు తీసుకుని బస్సు అద్దాలపై విసిరారు. ఈ ఘటనతో బస్సులోని బాలికలు ఒక్కసారిగా భయాందోళనకు గురై కేకలు పెట్టారు. నారాయణ విద్యాసంస్థల బస్సు డ్రైవర్ కుమార్ ను తన సీటు నుండి కిందకు లాగి ఇష్టం వచ్చినట్టు బట్టలు చిరిగేటట్టు కొట్టారు. తిరుచానూరు మంగళం అవుట్ పోస్టు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఘర్షణ వాతావరణాన్ని పరిశీలించి చెదరగొట్టారు. బస్సులో ఉన్న 25 మంది బాలికలను వాళ్ల తల్లిదండ్రులతో పంపి వేశారు. గంజాయి మత్తులో వున్న యువకులను పోలీస్ స్టేషన్ కు తరలించారు. తిరుచానూరు సిఐ శ్రీకాంత్ రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.